ఉష్ణోగ్రత (అంచనా)

19-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	36	29
రెంటచింతల	42	28

కోలాహలంగా..

ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం







యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతి, బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి,దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిని అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

- విజేతలకు బహుమతులు అందజేసిన వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్
- ప్రథమ బహుమతిగా బైకు, ద్వితీయ బహుమతిగా ఫ్రిడ్జ్, తృతీయ బహుమతిగా కలర్ టీవీ అందజేత
- 125 మందికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం.. విజేతల్లో ఆనందోత్సాహాలు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బహుమతుల ప్రదానో త్సవం కోలాహల వాతావరణంలో జరిగింది. శుక్రవారం గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలకు వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అంద జేశారు. గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో ముద్రితమైన కూపన్లను పాఠకులు ఆంధ్రజ్యోతి కార్యాలయంలో అందజేశారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఐజీ సర్వశ్రేష్ఠతిపాఠి ఆధ్వర్యంలో ఆయా కూపన్లలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయా విజేతలకు శుక్రవారం ఆంధ్రజ్యోతి ఉద్యోగులు, పాఠకుల సమక్షంలో బహుమతులను అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన యడ్లపల్లి గౌరికి ప్రథమ బహుమతిగా బైకును అందజేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన ఎస్‌డీబీ బిహారిసాహెబ్‌కు ద్వితీయ బహుమతి కింద ఫ్రిడ్జ్ అందచేశారు. పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు చెందిన దొరడ్ల సుజాతకు తృతీయ బహుమతిగా కలర్ టీవీని అందజేశారు. మరో 125 మందికి ప్రోత్సాహక బహుమ తులుగా వివిధ రకాల గృహోపకరణాలను అందజేశారు.

ఆంధ్రజ్యోతి కార్యక్రమాలు గర్వకారణం : విద్యాసాగర్

నేటి సమాజంలో పఠనాసక్తి తగ్గుతున్న క్రమంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. లక్కీడ్రాలు నిర్వహిస్తూ పాఠకులకు బహుమతులు అందజేయడం విశేషమ న్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పత్రికా పఠనాన్ని ఆంధ్ర జ్యోతి ప్రోత్సహిస్తుందన్నారు. నేటి సమాజంలో పత్రికల ద్వారానే వాస్తవాలు తెలుస్తాయని తెలిపారు. సమాజానికి దిక్సూచిలా పత్రికలు పనిచేస్తున్నా యన్నారు. నేటి ఆధునిక సమాజంలో పత్రికలు ఆవశ్యకత ఎంతో ముఖ్యమైనదని (మిగతా 7వ పేజీలో)



పుడమికి.. పరీక్షలు

ఈ పరీక్షలు చేస్తారు..

నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాల స్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా నేలల్లోని లోపాల ఆధారంగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పోషకాలు వాడకం.. పంటల సాగుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇస్తారు.

అవగాహన లేమితో కొందరు.. అధిక దిగుబడుల కోసమని మరికొందరు ఇష్టం వచ్చినట్లుగా.. అవసరం లేకపోయినా రసాయన ఎరువులను వాడుతూ భూ సారాన్ని నిస్సారం చేసేస్తున్నారు. ప్రమాదకర స్థాయిలో ఉన్న పుడమిని పరీక్షించి సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి అటు నేల తల్లిని రక్షించి.. ఇటు రైతులను ఆదుకునేలా ప్రభుత్వం భూ ఆరోగ్య పరీక్షలపై దృష్టి సారించింది. సకల పోషకాలకు నెలవుగా ఉండాల్సిన భూమి రసాయనాలతో నాశనమవగా భూ సారం నానాటికీ తగ్గిపోతోంది. రసాయన ఎరువుల వాడకంలో సమతుల్యతను పాటిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ పరిస్థితుల్లో నేలలో ఏఏ పోషకాలు లోపించాయో గుర్తించి వాటిని మాత్రమే వినియో గించేలా రైతులకు చెప్పి వారిని చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. సాయిల్ టెస్టులు చేసి మే 15వ తేదీ కల్లా హెల్త్ కార్డులను రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యంగా నిర్దేశించింది. అయితే భూసార పరీక్షలు ఇంకా ప్రారంభం కాకపోవడంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

- భూ ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- వచ్చే నెల 15 కల్లా హెల్త్ కార్డుల జారీ
- మూడు జిల్లాల్లో 60,124 మట్టి పరీక్షల లక్ష్యం
- సాగుకు ముందే మట్టి పరీక్షలు పూర్తి చేసేలా ప్రణాళిక



నరసరావుపేటలోని భూసార పరీక్షా కేంద్రం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకం. భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆయా పరీక్షల ఆధారంగా భూ సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఇంతటి కీలకమైన పుడమి ఆరోగ్య పరీక్షలకు వ్యవసాయ శాఖ సమాత్తమైంది. పంటలు సాగుకు ముందే మట్టి (మిగతా 7వ పేజీలో)



● గుంటూరులో సందేశం ఇస్తున్న బిషప్ భాగ్యయ్య

భక్తిశ్రద్ధలతో.. శుభ శుక్రవారం

- చర్చిలు, సమాధుల తోటల్లో ప్రార్థనలు

నరసరావుపేట, ఏప్రిల్ 18: శుభ శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) వేడుకలు జిల్లావ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించారు. జిల్లాలోని అన్ని చర్చిలు, అన్ని ప్రాం తాల్లోని సమాధుల తోటల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు శిలువ మరణం పొందిన గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నాటి క్రీస్తు శ్రమలు, కష్టాలను గుర్తు తెచ్చుకుని కన్నీటి ప్రార్థనలు చేశారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి ప్రార్థనలు చేశారు. వారిని గుర్తు చేసుకుంటూ సమాధులపై పుష్పగుచ్ఛాలు ఉంచి క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. 40 రోజులుగా ఉపవాస దీక్షలు చేపట్టిన వారు ప్రార్థనల అనంతరం దీక్ష విర మించారు. అంతకముందు క్రైస్తవులు పలు ప్రాంతాల్లో శిలువయాత్ర నిర్వ హించారు. సర్వమానవాళి పాప పరిహారం నిమిత్తం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని శిలువలో ప్రభువు పలికిన ఏడు మాటల విశిష్టత గురించి గురు వులు, పాస్టర్లు గుడ్‌ఫ్రైడే సందేశమిచ్చారు. అన్ని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి.



నరసరావుపేటలోని పట్టణ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

జిందాల్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు పెరిగాయని, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని చిలకలూరిపేట అగ్నిమాపక కేంద్రం అధికారి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. కొండవీడు రెవెన్యూ పరిధిలోని జిందాల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిరణ్‌కుమార్ రెడ్డి అగ్నిప్రమాదాలపై మిల్లు యాజమాన్యానికి, సిబ్బందికి అవగాహన కల్పించి మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. విద్యుత్ ప్లాంట్లు, ఫ్యాక్టరీలు, బహుళ అంతస్తుల భవనాలలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా నివారించాలి, లోపల చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ చారి, అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్ వెంకయ్య, ఆర్ మాణిక్యరావు, ఫైర్‌మెన్ పవన్‌కుమార్, కెఎల్ఎన్ రాజు, సయ్యద్ కరిముల్లా పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

- సాగు లక్ష్యం 5.75 లక్షల ఎకరాలు
- విత్తన పంపిణీకి కంపెనీలతో ఒప్పందాలు
- 15.30 లక్షల మిరప, 7.03 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలకు ఇండెంట్



పొలం దుక్కిదున్నతున్న రైతు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో పంటల సాగుకు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. సాగు లక్ష్యం 5.75 లక్షల ఎకరాలుగా నిర్ధారించి విత్తన ప్రణాళికను ఖరారు చేసింది. మిరప, పత్తి, వరి, కంది పంటల సాగుకు అవసరమైన విత్తన సేకరణకు సమాయత్తమైంది. విత్తన పంపిణీకి కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటోంది. జిల్లాకు అవసరమైన ఎరువులు, విత్తనాలకు సంబంధిం చిన ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్లు వ్యవసాయ శాఖ జేడీ మురళి శుక్రవారం తెలిపారు. సాగునీరు పుష్కలంగా సరఫరా చేయడంతో గత ఏడాది ఖరీఫ్, రబీలో సాగు ఆశాజనకంగా ఉంది. వరి విస్తృతంగా సాగవగా మొక్కజొన్న, పొగాకు, కంది సాగు పెరిగింది. పత్తి సాగు భారీగా తగ్గింది. మిరప దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధర రైతులను దెబ్బ తీసింది. ఈ ఏడు మిరప సాగుపై రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడు కూడా పొగాకు సాగు వైపు రైతులు మొగ్గుచూపే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో నికర సాగు భూమి 7,69,125 ఎకరాలు. 4,04,599 లక్షల కమతాలు ఉన్నాయి. సాగర్ కాల్వల కింద సుమారు ఐదు లక్షల ఎకరాలు, చెరువులు, బోర్ల కింద 1,25,000 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

ఈ ఏడు సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యం లో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. వేసవి దు క్కులు దున్నుతున్నారు. మాచర్ల, గురజాల ప్రాంతాల్లో వేసవిలో పత్తి సాగు చేపట్టారు. జిల్లా సగటు వర్షపాతం 775.5 మీమీ, 62 శాతం నైరుతి, 27 శాతం ఈశాన్య రుతు పవనాల ద్వారా వర్షపాతం నమోదవు తుందని అంచనా వేశారు. జిల్లా సాధార ణ సాగు విస్తీర్ణం 6,20,875 ఎకరాలు కాగా 5.75 లక్షల ఎకరాల్లో పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ ప్రతిపాదిం చింది. ఖరీఫ్‌లో పత్తి 2.50 లక్షల ఎకరాలు, వరి 1.12 లక్షల ఎకరాల్లో, కంది 75,000 ఎకరాల్లో, మిరప 1.25 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా లను రూపొందించింది. ఈ మేరకు విత్తన అవసరాల అంచనాతో ఇండెంట్లను సిద్ధం చేసింది. కిలోకు రూ.5 రాయితీ వరి విత్తనం 18,800 క్వింటాళ్లు అవసరం ఉం టుందని అంచనా వేసింది. పత్తి విత్తనం 7.03 లక్షల ప్యాకెట్లు, మిరప 10 గ్రాముల విత్తన ప్యాకెట్లు 15,30,000 అవసరం అవుతుందని అంచనా వేసింది. వరి సాగుకు ముందు భూసారం పెంపొందిం చేందుకు పచ్చి రొట్ట సాగు చేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఇందుకోసం జీలుగ, పెసర, జనుము విత్తనాలను 50 శాతం సబ్సిడీపై 5,700 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయను న్నారు. ఎరువులు 3.51 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం ఉందని అంచనా వేశారు.

యూరియా 1,02,096, డీఏపీ 38,234, కాంప్లెక్స్ 1,61,784, ఎంవోపీ 9,617, ఎస్ఎస్‌పీ 5,316 మెట్రిక్ టన్నుల ఎరువుల డిమాండ్ అంచనాతో ప్రతి పాదనలు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరు వుల నాణ్యతను నిర్ధారించేందుకు జిల్లాలో 7 అగ్రి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా పంటలకు పురుగు మందులు పిచికారి చేసేందుకు మండలానికి మూడు డ్రోన్లు అవసరం ఉందని అంచనా వేసి వాటిని అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ దేవస్థానం సమీపంలోని మక్కెన చినరామయ్య కోర్టులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండు పళ్ల విభాగంలో 23 జతలు పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ పోటీల్లో నాలుగు పళ్లు, ఆరు పళ్లు, సేద్యం, జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో పాటు ఎడ్ల బల ప్రదర్శన పోటీల నిర్వాహకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

30 లోపు ఆస్తిపన్ను చెల్లించండి

- కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ళ పట్టణ పరిధిలో నివాస గృహాలు, వ్యాపార సముదాయాల యజమానులు ఈ నెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను 5 శాతం రాయితీతో చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు కమిషనర్ పి శ్రీధర్ తెలిపారు. సెలవు దినాలలో కూడా మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆస్తిపన్ను చెల్లించే అవకాశాన్ని కల్పిస్తుందని కమిషనర్ తెలిపారు.

కోడెల స్ఫూర్తితోనే శాసన సభ నిర్వహణ

- బలిజేపల్లిలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- గ్రామంలో ఎన్టీఆర్, డాక్టర్ కోడెల విగ్రహాల ఆవిష్కరణ
- కొండమోడు-పేరేచర్ల రహదారికి త్వరలో శంకుస్థాపన : లావు

రాజుపాలెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్ఫూర్తితోనే ప్రస్తుతం అసెంబ్లీని నడిపిస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. మండలంలోని బలిజేపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీ ఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావుల విగ్రహావిష్కరణ, సచివాల యం ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రఘురామకృష్ణరాజు ప్రసంగించారు. డాక్టర్ కోడెల క్రమశిక్షణ ఆచరణీయమన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కొండమోడు-పేరేచర్ల రహదారి నాలుగు వరుసల విస్తరణ పనులకు మూడు, నాలుగు రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంత ప్రజలు కక్షలతో ఉండేవారని వారికి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపి వారిలో కోడెల మార్పు తెచ్చారని గుర్తు చేశారు. కొండమోడు-పేరేచర్ల రహదారి విస్తరణలో ఇప్పటికే 80శాతం మందికి పరిహారం ఇచ్చామని మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు. కేంద్రంతో మాట్లాడి రూ.11,700 మద్దతు ధరకు మిర్చి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆయి తే కొంత సమయం పడుతుందన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బలిజేపల్లికి ఇరువైపుల ఉన్న ఎద్దువాగుపై బ్రిడ్జిలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా అవార్డు అందుకున్న రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ అన్వర్‌బేగంను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, నాయకులు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, మహిళ అధ్యక్షురాలు బీమినేని వందనదేవి, పల్లపాటి రాములు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, సాగి శ్రీనివాసరావు, ఆలా సుబ్బారావు, కొలికొండ సీతారామయ్య, మొరసా శ్రీను, పాడి పెద్దవెంకటేశ్వర్లు, సానికొమ్ము కోటిరెడ్డి, తిరుమలరాజు, కుంభా నాగేశ్వరరావు, గడిపర్తి సాంబశివరావు, షేక్ అల్లాబక్షు, శనగపూల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్, కోడెల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎంపీ లావు ఎమ్మెల్యే కన్నా, డాక్టర్ శివరాం

బచ్చలి ఆరోగ్యానికి నెచ్చెలి

కారం, వగరు, తీపి ఈ మూడురుచులు కలగలసిన ఆకు కూర బచ్చలి. దీనిలో పాలకూరతో సమానమైన పోషకతత్వాలు ఉంటాయి. ఇది తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాగా పెరుగుతుంది. భోజన కుతూహల గ్రంథంలో దీనిని పోతకి లేదా ఉపోదకీ అని పేర్కొన్నారు. ఈ బచ్చలిలో రెండు రకాలు ఉన్నాయి. ఆకుపచ్చ కాండం, ఆకుపచ్చ ఆకులతో ఉన్న బచ్చలిని బసెల్లా ఆల్బా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఎర్రని కాండం, ముదురు ఆకుపచ్చ ఆకులు కలిగిన బచ్చలిని బసెల్లా రుబ్రా అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. దీని గింజలు ఊదా రంగులో ఉంటాయి. ఈ రంగును తెలుగు వారు బచ్చలిపండు రంగు అనే పిలుస్తారు.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

చాలా మంది బచ్చలి కూర వేడి చేస్తుందని భావిస్తారు. కానీ ఇది వాతాన్ని, వేడిని- రెండింటినీ అదుపు చేస్తుంది. ఆయుర్వేద గ్రంథాల్లో బచ్చలి కూర వల్ల ప్రయోజనాలను వివరించారు. ఆ ప్రయోజనాలు..

- ఇది రక్తశుద్ధికి తోడ్పడుతుంది. ఎముకలకు పుష్టినిస్తుంది.
- అనేక రకాల స్త్రీ సమస్యలకు ఇది పరిష్కారం. సంతాన ప్రాప్తినిస్తుంది. గర్భాశయపోషకంగా పనిచేస్తుంది.
- బచ్చలి ఆకును నమిలితే నోటిపూతను నివారిస్తుంది. ఈ ఆకు రసంలో పసుపు కలిపి పెడితే గాయాలు త్వరగా మానతాయి. కాలిన గాయాలకు ఈ ఆకు రసం మందుగా పనిచేస్తుంది. ఈ రసాన్ని రాస్తే దురదలు తగ్గుతాయి.
- బచ్చలి కూరకు మూత్ర పిండాల్లో రాళ్లను కరిగించే స్వభావముంది.
- బచ్చలి కూరలో జిగురు పదార్థం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మలబద్ధకం ఉన్నవారు బచ్చలికూరను తింటే మంచిది.

• గంగరాజు అరుణాదేవి

రకరకాల వంటలు

తెలుగువారు కంద బచ్చలి కూరను అన్ని శుభ కార్యాల్లోనూ వండుతారు. ఇక బచ్చలికూరతో రకరకాల రుచికరమైన వంటలు చేసుకోవచ్చు.

- బచ్చలికూరలో నూనె వేసి తాలింపు వేసి మూత పెట్టి మగ్గనిస్తే మెత్తగా అవుతుంది. దీనిలో ఉడికిన కందిపప్పు లేదా పెసర పప్పు వేసి పప్పుగా చేసుకోవచ్చు.
- బచ్చలికూరను సన్నగా తరిగి దీనిలో శనగ పిండి లేదా మొక్కజొన్న పిండి కలిపి కొద్దిగా నూనె వేసి వేయిస్తే రుచికరమైన కూర అవుతుంది. దీనిలో కొందరు కొబ్బరి తురుము, నువ్వుపప్పు కూడా వేస్తారు.




- బచ్చలి కూరను సన్నగా తరిగి దానిని నూనెలో దోరగా వేయించాలి. ఆ తర్వాత దానిలో తాలింపు, కొద్దిగా చింతపండు వేయాలి. దీనిని మిక్సీలో వేసి రుబ్బి పచ్చడిగా కూడా చేసుకోవచ్చు.

దోసకాయ చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు: చేప ముక్కలు- పావు కిలో, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, నూనె- పావు కప్పు, ఆవాలు- పావు చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- 4, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- రెండు రెమ్మలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, పసుపు- అర చెంచా, కారం- ఒక చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, టమాటా గుజ్జు- అర కప్పు, ఉప్పు- తగినంత, చింతపండు రసం- ఒక కప్పు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం: ముందుగా చేప ముక్కలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. తరవాత వీటిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పావు చెంచా పసుపు, పావు చెంచా ఉప్పు, పావు చెంచా కారం వేసి చేత్తో కలపాలి.

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, కరివేపాకు, పావు చెంచా పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా కలపాలి. ఇవన్నీ దోరగా వేగాక అర చెంచా ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత దోసకాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత ముప్పావు చెంచా కారం, గరం మసాలా పొడి వేసి కలపాలి. ఇవి కొద్దిగా వేగాక టమాటా గుజ్జు, చింతపండు రసం వేసి బాగా కలపాలి. అయిదు నిమిషాల తరవాత అర చెంచా ఉప్పు వేసి, రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. తరవాత చేప ముక్కలు వేసి మూతపెట్టి మగ్గించాలి. ఆరు నిమిషాల తరవాత మూత తీసి కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి వేడి అన్నంలోకి బాగుంటుంది.




జాగ్రత్తలు

- రోహు, కట్లా, శీలావతి, కొరమీను చేపలతో ఈ పులుసు చేసుకోవచ్చు. కానీ ముల్లు ఉండే రోహు చేపతో చేసిన పులుసు రుచికరంగా ఉంటుంది.
- దోసకాయ, చేప ముక్కలను మరీ మెత్తగా మగ్గించకూడదు.

వంటిల్లు

మనం దోసకాయలతో ఇగురు, పప్పు, ఆవకాయ... ఇలా ఎన్నో రకాలు చేస్తూ ఉంటాం. టమాటా, చిక్కుళ్లు లాంటివి చేర్చి రకరకాల కూరలు కూడా వండేస్తూ ఉంటాం. ఇవి కాక దోసకాయలతో మాంసాహార రుచులు కూడా ప్రయత్నించవచ్చు. దోసకాయలను విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసం ఈ వంటకాలు.

దోసకాయతో వెరైటీగా..



దోసకాయ వంకాయ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- దోసకాయ ముక్కలు- ఒక కప్పు, వంకాయ ముక్కలు- ఒక కప్పు, టమాటా ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- పన్నెండు, చింతపండు- నిమ్మకాయంత, కొత్తిమీర- ఒక చిన్న కట్ట, కరివేపాకు- రెండు రెమ్మలు, జీలకర్ర- ఒక చెంచా, అవాలు- పావు చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, నూనె- నాలుగు చెంచాలు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, పచ్చిశనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, ఎండు మిర్చి- ఒకటి, ఇంగువ- చిటికెడు

తయారీ విధానం

- స్టవ్ మీద గిన్నెపెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, కొద్దిగా పసుపు, పచ్చిమిర్చి ముక్కలు, వంకాయ ముక్కలు వేసి దోరగా వేపాలి. తరవాత టమాటా ముక్కలు, చింతపండు, కొద్దిగా ఉప్పు వేసి రెండు నిమిషాలు మగ్గించాలి. తరవాత అర కప్పు దోసకాయ ముక్కలు, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. మిక్సీ గిన్నెలో వెల్లుల్లి రెబ్బలు, వేయించిన వంకాయ-టమాటా ముక్కల మిశ్రమం వేసి కచ్చాపచ్చాగా ఉండేలా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద తాలింపు గిన్నె పెట్టి రెండు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. ఇందులో అర చెంచా జీలకర్ర, ఆవాలు, ఇంగువ, కొద్దిగా పసుపు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, ఎండు మిర్చి, కరివేపాకు, కొత్తిమీర తరుగు, అరకప్పు దోసకాయ ముక్కలు వేసి కలపాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని పచ్చడిలో వేసి బాగా కలపాలి. ఉప్పు సరిచూసుకోవాలి. ఈ పచ్చడి అన్నంలోకి రుచిగా ఉంటుంది.




దోసకాయ...
పులుపు, తీపి కలగలసిన రుచిలో ఉంటుంది. ఇందులో ఐరన్, కాల్షియం, పొటాషియం లాంటి మినరల్స్‌తోపాటు ఎ, సి, కె విటమిన్లు కూడా పుష్కలంగా ఉంటాయి. దోసకాయను తరచూ తినడం వల్ల ఎముకలు బలపడతాయి. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీరానికి కావాల్సినంత తేమ లభిస్తుంది. చర్మం మృదువుగా బిగుతుగా మారుతుంది. రక్తపోటు, మూత్రపిండాల సమస్యలు తగ్గుతాయి. దోసకాయలో ఉండే కుకుర్బిటాసిన్ ... మూత్రాశయ క్యాన్సర్‌ను నివారిస్తుంది.

జాగ్రత్తలు

- దోసకాయను చిన్న ముక్కలుగా కోయాలి. పాడవాటి వంకాయలు తీసుకుంటే పచ్చడి రుచిగా ఉంటుంది.
- గ్రైండ్ చేసేటప్పుడు కొన్ని వేయించిన పల్లీలు వేస్తే పచ్చడికి కమ్మదనం వస్తుంది.
- ఈ పచ్చడిని రోట్లో చేస్తే రుచి అద్భుతంగా ఉంటుంది.

దోసకాయ చికెన్ కూర



కావాల్సిన పదార్థాలు

- చికెన్- 300 గ్రాములు, దోసకాయ ముక్కలు- ఒక కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు కప్పులు, పచ్చిమిర్చి- మూడు, కారం- ఒకటిన్నర చెంచాలు, ఉప్పు- ఒకటిన్నర చెంచాలు, పసుపు- అర చెంచా, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఆవాలు- పావు చెంచా, జీలకర్ర- పావు చెంచా, ఎండుమిర్చి- రెండు, కరివేపాకు- రెండు రెమ్మలు, ధనియాల పొడి- అర చెంచా, నూనె- మూడు చెంచాలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- ఒక గిన్నెలో చికెన్ ముక్కలు, అర చెంచా ఉప్పు, అర చెంచా కారం, అరచెంచా అల్లం వెల్లుల్లి పేస్టు వేసి బాగా కలిపి అరగంటసేపు నానబెట్టాలి.
- స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, పసుపు వేసి దోరగా వేపాలి. ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలపాలి. ఇవన్నీ వేగాక నానబెట్టిన చికెన్ ముక్కలు వేసి కలపాలి. గిన్నెమీద మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత దోసకాయ ముక్కలు, ఒక చెంచా కారం, ఒక చెంచా ఉప్పు, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. అరగ్లాసు నీళ్లు పోసి మరో అయిదు నిమిషాలు మగ్గించాలి. చివరలో కొత్తిమీర తరుగు చల్లి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ కూర రోటీ, చపాతీ, పుల్కా, వేడి అన్నంలోకి బాగుంటుంది.

జాగ్రత్తలు

- చికెన్ ముక్కలు మగ్గుతున్నప్పుడు అందులో ఒక గరిటెడు పెరుగు కలిపితే కూర రుచిగా ఉంటుంది.
- దోసకాయను పెద్ద ముక్కలుగా కోయాలి.

పర్సనల్ కేర్

చెవిలో పురుగు దూరితే..!

ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.
- చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.
- గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.
- ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. అలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.
- చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.
- ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.



సెలెబ్ టాక్



ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!

పాత వాటికి కొత్త కళ

"ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

పాత జ్ఞాపకాలు పదిలంగా...

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.



అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్స్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."

మేకప్

ఎండల్లో చూడచక్కగా...

ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి. అందుకోసం...

ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పని చేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.

ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.



మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

లిప్ టింట్: టింట్ వల్ల పెదవులు సహజసిద్ధ మెరుపును సంతరించుకుంటాయి. టింట్ లేకపోతే, పౌడర్ బ్లష్, లిప్ బామ్‌లను సమపాళ్లలో కలుపుకుని లిప్ టింట్‌గా వాడుకోవచ్చు. బ్లష్ లేకపోతే దానికి బదులుగా లిప్ లైనర్ లేదా క్రీమీ లిప్‌స్టిక్‌ను కూడా వాడుకోవచ్చు.

మెగా డీఎస్సీలో 1,143 పోస్టులు

● ఉమ్మడి గుంటూరు జిల్లాకు కేటాయింపు

● సబ్జెక్టుల వారీగా జాబితా సిద్ధం చేసిన విద్యాశాఖ

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. జిల్లాల వారీగా ఇప్పటికే పోస్టుల వివరాలను ప్రభుత్వం సేకరించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి 1143 పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నాయి. విద్యాశాఖ సేకరించిన వివరాల ప్రకారం ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల ఆధ్వర్యంలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 35, హిందీ 54, ఇంగ్లీషు 61, గణితం 32, ఫిజికల్ సైన్స్ 57, బయాలజికల్ సైన్స్ 82, సోషల్ స్టడీస్ 102, ఫిజికల్ ఎడ్యుకేషన్ 166, ఎస్జీటీ 306 పోస్టులను భర్తీ చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 26, హిందీ 6, ఇంగ్లీషు 9, గణితం 4, ఫిజికల్ సైన్స్ 1, బయాలజికల్ సైన్స్ 5, సోషల్ స్టడీస్ 9, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, ఎస్జీటీ 185 పోస్టులు భర్తీ చేయనున్నారు.

24న డీఎస్సీపై అవగాహన సదస్సు

గుంటూరు (విద్య)ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న డీఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ డైరెక్టర్ రామన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం భర్తీ చేయబోతున్న 16,347 ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి ప్రిపరేషన్, పరీక్ష విధానంపై అభ్యర్థులకు ఉచిత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. బ్రాడీపేట 2 / 11 కాంపిటీషన్ సక్సెస్ కాలేజీ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు వక్తగా పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు. వివరాలకు బ్రాడీపేట లోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏడీఆర్ఎంగా రమేష్‌కుమార్... సైమన్ బదిలీ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజనల్ అదనపు మేనేజర్(ఏడీఆర్ఎం)గా ఎం.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. ఐఆర్ఎస్ఈ/ఎన్ఎఫ్ఎస్ఏజీకి చెందిన ఆయన ఎన్‌హెచ్ఎస్ ఆర్‌సీఎల్‌లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు. డిప్యూటేషన్ నుంచి వెనక్కు రప్పించిన రైల్వేబోర్డు గుంటూరు ఏడీఆర్ఎంగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఏడీఆర్ఎం కె.సైమన్ బదిలీ అయ్యారు. ఆయనకు నూతన పోస్టింగ్ త్వరలోనే ఇవ్వనున్నట్లు పేర్కొంది.



ప్రధాని మోదీ పర్యటనకు విస్తృతంగా జరుగుతున్న ఏర్పాట్లు





అమరావతి శంకుస్థాపనకు ఏర్పాట్లు

● ప్రధాని మోదీ పర్యటనకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి పునర్నిర్మాణ పనులకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 2వ తేదీ జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయం వెనుక భాగంలోని సభాస్థలి ప్రాంగణంలో పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భారీ టెంట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల కోసం ఒక టెంట్ ఆఫీసును సిద్ధం చేశారు. సభాస్థలిలో గ్యాలరీల భాగాన్ని భారీ ఎత్తున యంత్రాలు, రోడ్డు రోలర్లతో చదును చేయిస్తున్నారు. ఈ కార్యక్రమానికి 5 లక్షల మంది రానుండటంతో భారీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. అలాగే, రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను తొలగిస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డును అందంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రీన్‌బెల్టుల్లో భారీగా లాన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పూల మొక్కలు నాటుతున్నారు. విద్యుత్ స్తంభాలకు రంగురంగుల ఎల్ఈడీ దీపాలను అమర్చారు. ఇక సభాస్థలిని కొండపల్లి బొమ్మలతో అందంగా అలంకరించనున్నారు.



రాజకీయ సన్యాసం చేసి..శరణు కోరు



● మాచర్లకు ఏం చేశావు పిన్నెల్లి

● వచ్చే ఏడాది వరికపూడిశెలను పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ధ్వజం

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా సర్వనాశనం చేసి, వరికపూడిశెల పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట తప్పారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం తన జన్మదినం సందర్భంగా నెహ్రూ నగర్‌లోని వీఏఎస్ గార్డెన్‌లో అభిమానులు ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గానికి ఏం చేశావు పిన్నెల్లి అంటూ మాజీ ఎమ్మెల్యేను నిలదీశారు. 15 ఏళ్లుగా నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచి నాశనం చేసిన పిన్నెల్లి భేషరతుగా ప్రజాలకు క్షమాపణలు చెప్పి.. శరణు కోరాలని డిమాండ్ చేశారు. అలాగే జగన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను కూల్చి చేసిన పాపాలే నేడు ఏపీకి శాపాలుగా మారాయని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ అవినీతి పాలనలో అరాచకం, అవినీతి, దోపిడి, దౌర్జన్యాలు, దాడులపై శ్వేత పత్రాలను విడుదల చేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీ ప్రజలు సుపరిపాలన చూస్తున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మాచర్లను అభివృద్ధి చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.800 కోట్లకు పైగా నిధులు తాగునీటికి కేటాయించగా, రహదారులకు, మౌలిక వసతులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయన్నారు. కేంద్రీయ విద్యాలయానికి రూ. 25 కోట్లు, అమృత స్కీం కింద రూ.100 కోట్లు, సెంట్రల్ రోడ్డు ఫండ్ కింద రోడ్లకు రూ.115 కోట్లు మాచర్లకు కూటమి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు

● రెండు నెలల్లో రోగులకు అందుబాటులోకి తెస్తాం

● సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి వెల్లడి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో రెండు నెలల్లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు (టోటల్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అందుబాటులోకి తెస్తున్నామని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రకటించారు. ప్రతి శుక్రవారం జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న 'మీ కోసం మేము' కార్యక్రమంలో భాగంగా ఆయన ఈ ప్రకటన చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహించారు. అప్పట్లో ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న డాక్టర్ కామినేని శ్రీనివాస్ కూడా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో ఈ ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటీవల రోగుల నుంచి వస్తున్న డిమాండ్ నేపథ్యంలో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లను తిరిగి ప్రవేశపెట్టేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ గతంలో తాము ఇంపోర్టెడ్ నీ ఇంప్లాంట్లు వాడామని, ఒక్కొక్క మోకీలు మార్పిడి సర్జరీకి రూ.1.70 లక్షలు ఖర్చు అయ్యిందని తెలిపారు. రెండు మోకీళ్ల మార్పిడికి రూ.3.40 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ల నిర్వహణ విషయమై ప్రభుత్వంతో మాట్లాడామని, మరో రెండు, మూడు నెలల్లో నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు ప్రారంభిస్తామని ఆయన ప్రకటించారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు అవసరమైన వారు ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు.

కోలాహలంగా.. ఆంధ్రజ్యోతి బహుమతుల ప్రదానోత్సవం



విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న వీవీఐటీ యూనివర్సిటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఆంధ్రజ్యోతి డీజీఎం ఎస్ రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ సుబ్బారావు తదితరులు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆంధ్రజ్యోతి డీజీ ఎం ఎస్. రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్.సాంబశివరావు, సర్క్యులేషన్ మేనేజర్ టి.విజయ్‌భాస్కర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ ఎం సుబ్బారావు, టెక్నికల్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



ఆంధ్రజ్యోతి లక్కీడ్రాలో బహుమతి గెలుస్తామని అనుకోలేదు. ప్రథమ బహుమతి కింద బైకును గెలుపొందినట్లుగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. దీంతో చాలా సంతోషం కలిగింది. ఆంధ్రజ్యోతి పాఠకులుగా ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్నాం. ఆంధ్రజ్యోతి పత్రిక, ఏబీఎన్ న్యూస్ ఛానల్ అంటే ఎంతో ఇష్టం. ఎండీ రాధాకృష్ణ, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

-యడ్లపల్లి గౌరి (ప్రథమ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి వార్తలు నచ్చుతాయి



పదిహేను సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడ్ని. ప్రతిరోజు పేపర్ చదువుతా. ముఖ్యంగా ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలు బాగా నచ్చుతాయి. ఎండీ రాధాకృష్ణ కొత్త పలుకు శీర్షికలో ఎన్నో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ద్వితీయ బహుమతిగా ఫ్రిజ్ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

-(బిహారి సాహెబ్, ద్వితీయ బహుమతి విజేత)

ఆంధ్రజ్యోతి పత్రిక అభిమానిని



కొన్నేళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకులం. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌లో వచ్చే వార్తలు, చర్చలు, ఓపెన్ హార్ట్‌విత్ ఆర్కే వంటి కార్యక్రమాలు బాగా నచ్చుతాయి. ప్రతిరోజు ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతాను. ఏబీఎన్‌లో వచ్చే న్యూస్ చూస్తుంటాము. తృతీయ బహుమతి కింద కలర్ టీవీ అందుకున్నాను. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

- దొరడ్ల సుజాత(తృతీయ బహుమతి విజేత)

మొదలైన ఆహ్వాన నాటిక పోటీలు



విడాకులు కావాలి.. నాటికలోని సన్నివేశం

పెదనందిపాడు, ఏప్రిల్, 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగానిలో ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి సౌజన్యంతో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రోటరీ శాతబ్ది గవర్నర్ జాష్టి ప్రమీలా రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ విడాకులు కావాలి నాటిక ఆకట్టుకుంది. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ బేధాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తడం సహజమని, అంతమాత్రాన కలిసి బతకలేమన్న తొందరపాటుతో విడాకులు కావాలనుకోవడం ఎంతవరకు సమంజసం ఈ నాటికి ప్రశ్నించింది. ద్వితీయ నాటికగా గుంటూరు వారి అమరావతి ఆర్ట్స్ చిగురు మేఘం, తృతీయ నాటికగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మాస్త్ర రూపం ప్రదర్శించారు. తొలుత అక్షయ పాఠశాల విద్యార్థుల భరత నాట్యం ఆకట్టుకుంది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా నుసుము నాగభూషణం, మానాపురం సత్యనారాయణ, కూచి రామాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ గౌరవాధ్యక్షులు, అధ్యక్ష కార్యదర్శులు ముద్దన రాఘవయ్య, పోపూరి నాగేశ్వరరావు, చెరుకూరి సాంబశివరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పరంకుశం శ్రీనివాసరావు, ఏఆర్ ప్రభాకర్, తాళ్ళ రాజశేఖర్‌రెడ్డి, జనసేన నియోజిక కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు అమదాలపల్లి నరేంద్ర, బండారు రాంబాబు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాష్టి ప్రమీలా రంగారావు

పుడమికి పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు పూర్తిచేసి నేల హెల్త్‌కార్డులను రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాలను సేకరించి పరీక్ష చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మే 15 కల్లా పరీక్షలు పూర్తి చేసి హెల్త్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి ఎంత మోతాదులో ఏఏ ఎరువులు వాడాలో రైతులకు అధికారులు సూచిస్తారు. పరీక్షలు ఆధారంగానే పంటల సాగుపై రైతులకు సూచనలు చేయనున్నారు. అయితే గత వైసీపీ పాలనలో భూసార పరీక్షలు అటకెక్కాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నేల ఆరోగ్యంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఏడాది కూడా విస్తృతంగా భూసార పరీక్షలు చేశారు. బాపట్ల జిల్లాలో 17,201 మట్టి నమూనాలను పరీక్షించారు. గుంటూరు జిల్లాలో 10,800, పల్నాడు జిల్లాలో 17,700 భూసార పరీక్షలు నిర్వహించి రైతులు నేల ఆరోగ్య కార్డులను రైతులకు అందజేశారు. ఈ ఏడాది భూసార పరీక్షల లక్ష్యాలను పెంచారు. పల్నాడు జిల్లాలో 23,437, బాపట్ల జిల్లాలో 22,825, గుంటూరు జిల్లాలో 13,882 మట్టి నమూనాల పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాలను నిర్ధారించి లోపాలు ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకోనున్నారు. రైతులు కూడా భూసార పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. నేల ఆరోగ్యం, పోషకం సామర్థ్యాన్ని బట్టి ఎరువుల వాడకం తెలుసుకోవచ్చంటున్నారు. పంటల దిగుబడి సరిగా లేకపోవడం.. సూక్ష్మ పోషకాల వంటి సమస్యలను పరీక్షల ద్వారా గుర్తించి వాటిని నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు చేస్తారు.

గత ఏడాది లోపాలు ఇలా..

● గత ఏడాది నిర్వహించిన భూ పరీక్షల్లో పల్నాడు జిల్లాలో నత్రజని, ఆర్గానిక్ కార్బన్ తక్కువగా ఉన్నట్లు తేలింది. పీహెచ్ తటస్థంగా ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో జింక్, ఐరన్, పాస్పరస్ మోతాదు తక్కువగా నిర్ధారించారు.

● బాపట్ల జిల్లాలో నత్రజని, పాస్పరస్, ఇనుము, జింక్ మాంగనీస్, కార్బన్ సూక్ష్మపోషకాల లోపాలు ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది. పీహెచ్ విలువ తటస్థంగా ఉంది.

● గుంటూరు జిల్లాలో జరిపిన నేల ఆరోగ్య పరీక్షల్లో నత్రజని, ఇనుము లోపాలు ప్రధానంగా నిర్ధారించారు.

పరీక్షలు సరే.. పోషకాల పంపిణీ?

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు పంటలకు అవసరం. గతంలో టీడీపీ ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై రైతులకు అందించింది. వైసీపీ ప్రభుత్వం సూక్ష్మపోషకాల పంపిణీని నిలిపేసింది. దీంతో రైతులు ఐదేళ్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత ఏడాది సూక్ష్మపోషకాలను పంపిణీ చేయలేదు. సూక్ష్మపోషకాల వల్ల కలుగుతున్న నష్టాన్ని నివారించుకోవడానికి రైతులు వ్యాపారులను ఆశ్రయించి దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో భూసార పరీక్షలతో పాటు సూక్ష్మ పోషకాలను రాయితీపై అందించాలని రైతులు కోరుతున్నారు.

తోట చంద్రయ్య హత్య కేసులో

స్పెషల్ పీపీగా హరిబాబు

● ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర హోంశాఖ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య కేసులో స్పెషల్ పీపీగా హైకోర్టు న్యాయవాది, టీడీపీ లీగల్‌సెల్ నాయకుడు మాగులూరి హరిబాబును నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఈ కేసును సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. పలువురు నిందితులకు తాజాగా నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. తోట చంద్రయ్యను 2022 జనవరి 12న వైసీపీ గూండాలు ఆయన స్వగ్రామం గుండ్లపాడులోనే అత్యంత దారుణంగా హతమార్చారు. మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో తోట చంద్రయ్య గుండ్లపాడుతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలించారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీకి చెందిన ఎంపీపీ చింతా శివరామయ్య, ఆయన కుమారుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైసీపీ గుండాలు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తోట చంద్రయ్యను వెంటాడి, దారుణంగా హతమార్చారు. ఆయనపై దాడి చేసే సమయంలో జై జగన్, జై వైసీపీ అంటే ప్రాణాలతో వదిలేస్తామని హెచ్చరించారు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ చంద్రయ్య జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. దీంతో చంద్రయ్యను దారుణంగా నరికి చంపారు. కూటమి ప్రభుత్వం తోట చంద్రయ్య కేసును సీఐడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా టీడీపీ లీగల్ సెల్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది మాగులూరి హరిబాబును నియమిస్తూ శుక్రవారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన హరిబాబు గతంలో గుంటూరు జిల్లా కోర్టులోనూ పనిచేశారు.

బైక్ ఢీకొని మహిళ మృతి



షేక్ షంషాద్ బేగం మృతదేహం

బాపట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మైనర్ బైక్‌తో ఢీకొట్టడంతో మహిళ మృతిచెందిన ఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణ సీఐ ఆర్.రాంబాబు వివరాల మేరకు.. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన షేక్ షంషాద్ బేగం(56), చేబ్రోలు నుంచి బాపట్లకు బస్సులో వచ్చినట్లు టికెట్ ఉంది. బంధువు చనిపోతే చూడడానికి వచ్చిన షంషాద్ బేగంను జీబీసీ రోడ్డులోని వన్‌వే వద్ద ఓ మైనర్ బాలుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఆమె పడిపోయి తలకు గాయం కావడంతో స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. వీఆర్వో నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసి, అనంతరం వివరాలు సేకరించినట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన మైనర్‌ను అదుపులోకి తీసుకుని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం శుక్ర వారం నాటికి 515.00 అడుగులు ఉంది. ఇది 140.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

క్రైస్తవులు, దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులు, దళితుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుడ్ ఫ్రైడే ముందు రోజే పాస్టర్లకు మంత్రి లోకేష్ శుభవార్త తెలిపారన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చినమాట ప్రకారం 8,427 మంది పాస్టర్లకు గౌరవ వేతనం కింద 7 నెలలకు రూ. 35 వేలు చొప్పున మంజూరు చేశారని గుర్తుచేశారు. 270 చర్చిల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారన్నారు. బొట్టు కోటేశ్వరరావు, తిక్కా కొండలు, ప్రసాద్, బ్రహ్మం, ఆంజనేయులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లులో ముస్లింల నిరసన ర్యాలీ

వక్ఫ్ సవరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ

నకరికల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణను నిరశిస్తూ శుక్రవారం నకరికల్లులో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 చేయడం ద్వారా వక్ఫ్ భూములకు సంబంధించి పత్రాలులేని ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సవరణ తమకు ఆమోద యోగ్యం కాదని ముస్లింలు పేర్కొన్నారు.

అమరావతిలో..

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును రద్దుచేయాలని మండల కేంద్రంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో యువకులు, మహిళలు నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అమరావతితోపాటు పలుగ్రామాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు. మసీద్ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ముందు సాగారు. బృందావన్‌సెంటర్‌లో పలువురు బిల్లుకు వ్యతిరేకంగా ప్రసంగించారు. అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ బాషా, పశ్చిమ కమిటీ కార్యదర్శి బాషా, స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి కరీమ్ మోహిద్దీన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో...

సత్తెనపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో ముస్లింలు శుక్రవారం పట్టణంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. బిల్లు రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని ముస్లిం పెద్దలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం


అంబేడ్కర్ విగ్రహం వద్ద వినతి పత్రాన్ని పెట్టిన దృశ్యం

పెదకూరపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డును రాజకీయం చేయడం తగదని పెదకూరపాడులో ముస్లింలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌ను కాపాడండి, రాజ్యాంగాన్ని రక్షించండి అని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి శాంతి యుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.


పూజాకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

రేపు వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండ్రాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆదివారం జరిగే ప్రతిష్ఠామహోత్సవంలో స్వామివార్ల విగ్రహాలు, విమాన శిఖర ప్రతిష్ఠ జరగనుంది. తొలిరోజు జరిగిన కార్యక్రమాలలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంఎల్‌ఏ భాష్యం ప్రవీణ్ వేర్వేరుగా పూజలు నిర్వహించారు. సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

క్రోసూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పీసపాడు ప్రాథమిక పాఠశాల(ఎస్సీ) వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో-2 ఎం.గణేష్, 88 తాళ్ళూరు కాంప్లెక్స్ చైర్మన్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కంచేటి నరసింహారావు, సర్పంచ్ కోటమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ మేకల రమేష్, ఎస్టీయూడీ రాష్ట్ర నాయకుడు జంగం కోటేశ్వరరావు, ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, హెచ్ఎం పి.పిచ్చయ్య పాల్గొన్నారు.

పులిచింతల నీటి సమాచారం

అచ్చంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 30.14 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,700, లీకుల ద్వారా 300, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోందని పేర్కొన్నారు.

మాదిగలు చంద్రబాబుకు రుణపడి ఉండాలి

రెంటచింతల,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ సీఎం చంద్రబాబు వల్లే జరిగిందని మాదిగలు సీఎంకు రుణపడి ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మామిడి రవి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో వైసీపీ ప్రభుత్వం మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు.

కన్నెగంటికి నివాళి

రెంటచింతల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పల్నాటి పుల్లరి నిరాకరణ యోధుడు కన్నెగంటి హనుమంతు 140వ వర్ధంతిని శుక్రవారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. హనుమంతు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించి, ప్రధానరహదారిపై మానవహారం ఏర్పాటుచేశారు. హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సభ్యత్వం కార్డులు అందజేత

గురజాలటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ టీడీపీ సభ్యత్వకార్డులను బూత్ కన్వీనర్లకు అందించారు. ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వకార్డులను అందించాలన్నారు.

బ్రహ్మన్నకు బ్రహ్మరథం

● ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


బత్తాయి గజమాలతో స్వాగతం చెబుతున్న కూటమి నేతలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మాచర్ల పట్టణంలో భారీ జనసందోహం నడుమ అంబరాన్నంటాయి. శ్రీశైలం రోడ్డులోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే జూలకంటి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిమానులు ఏర్పాటుచేసిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. అభిమానుల నృత్యాలు, భారీ గజమాలలు, మహిళల హారతులు నడుమ ర్యాలీ నెహ్రూనగర్‌లోని వీవీఎన్‌గార్డెన్ వరకు సాగింది.

భారీ ఏర్పాట్లు

ఎన్నికల్లో జూలకంటి ఘన విజయం సాధించిన తర్వాత ఎమ్మెల్యే హోదాలో జరిగిన జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణుల, కూటమి నేతలు పండుగలా జరుపుకున్నారు. గురువారం అర్ధరాత్రి భారీ కేక్‌లను కట్ చేసి, బాణసంచా కాల్చి ఎమ్మెల్యే జూలకంటికి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం భారీ ర్యాలీలో జై జేబీఆర్ అంటూ కేరింతలు కొడుతూ అభిమానాన్ని చాటుకున్నారు. రింగురోడ్డు సెంటర్‌లో నిమ్మకాయలు, వివిధ రకాల పుష్పాలతో చేసిన భారీ గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అలాగే వడ్డే ఓబన్న విగ్రహం వద్ద గుమ్మడికాయలతో, పార్కు సెంటర్లో వివిధ రకాల పూలతో, బస్టాండ్ సెంటర్లో చెరకు గడలతో, నెహ్రూనగర్‌లో బత్తాయి పండ్లతో ఏర్పాటు చేసిన గజమాలలతో ఎమ్మెల్యే జూలకంటికి ఘన స్వాగతం పలికారు.

శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు

అభిమాన నాయకుడు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు వీవీఎన్ గార్డెన్ వద్దకు బారులు తీరారు. వేదిక పైన భారీ కేక్‌లు కట్ చేసి బహుమతులు అందించి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో ఫోటో దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం వేదిక వద్ద టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ విందు భోజనం చేశారు. తనపై ఇంతటి ప్రేమానురాగాలు, అప్యాయతలు చూపుతూ ఎండను సైతం లెక్క చేయకుండా వచ్చి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే జూలకంటి కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

దుర్గి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఎస్ఎస్ స్టూడియో ప్రొప్రయిటర్ శ్రీరాం కాశిబాబు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రారంభించారు. కేక్‌ను కట్ చేశారు. కూటమి నేతలు మాగులూరి నారయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చెన్నయ్య, అంకారావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జూలకంటికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేశవరెడ్డి


ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి శుభాకాంక్షలు

వెల్దుర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని శుక్రవారం మండల టీడీపీ నేతలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా ఆయనను సన్మానించారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కుర్రి శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, మధుసూదన్‌యాదవ్, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జూలకంటి జన్మదిన వేడుకలు


రెంటచింతల: తెలుగు తమ్ముళ్ల ర్యాలీ

రెంటచింతల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రెంటచింతలలో ఘనంగా జరిపారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పురవీధుల్లో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నియాదవ్ నేతృత్వంలో అతిధూతల వృద్ధాశ్రమంలో అన్నదానంచేశారు. టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, సు మంత్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కారంపూడిలో...

కారంపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు అభివృద్ధికి బ్రహ్మానందరెడ్డి వంటి నేత అవసరం అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి జన్మదినం పురస్కరించుకొని పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద కేక్‌ను కట్ చేశారు. వెల్దుర్తిలోని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి గృహానికి చేరుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు పంగులూరి పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం పట్టణ, గ్రామీణ చర్చిల్లో ఘనంగా జరిగాయి. పిడుగురాళ్ల లూథరన్ చర్చి వేడుకలలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు సాయినిఖిల్ పాల్గొని ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు పాస్టర్లు ఏసుప్రభు జీవితం గురించి వివరించారు.

మాచవరంలో..

మాచవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మాచవరంలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ సాగర్ క్రీస్తు సందేశాన్ని తెలియ జేస్తూ ఏసుప్రభు సిలువ దారణ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భక్తి గేయాలు ఆలపించారు.


పిడుగురాళ్ల: లూథరన్ చర్చిలో ప్రార్థనలో ఎమ్మెల్యే యరపతినేని తనయుడు నిఖిల్

క్షమాగుణం క్రీస్తు ప్రవచనం

రెంటచింతల,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్‌సీఎం, లూథరన్ చర్చిల్లో భక్తులు ప్రార్థనలు చేశారు. కానుకమాత ఆలయంలో ఫాదర్ వైఎల్ మర్రెడ్డి, లూథరన్ చర్చిలో పాస్టర్ దేవానందం, తుమ్మకోటలో గుంటూరు తూర్పు మాజీ బిషప్ రెవరెండ్ డేగల యోహాన్ తదితరులు కల్వరిలో సిలువ మరణం పవిత్ర త్యాగాన్ని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. సహాయ విచారణ గురువు ఆగస్టీన్ ఉన్నారు.

విజయపురిసౌత్‌లో..

మాచర్ల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను శుక్రవారం విజయపురిసౌత్ సాగరమాత ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువ ప్రదర్శన నిర్వహించారు. విచారణగురువు పామిశెట్టి జోసఫ్ దైవ సందేశమిచ్చారు. ఆలయ పెద్దలు ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌర్రాజు, కట్టా రాజు, శౌరిబాబు, మరియదాసు పాల్గొన్నారు.

కారంపూడిలో..

కారంపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం బ్యాంకు సెంటర్లోని లూథరన్ చర్చి, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ చర్చిలో పాస్టర్లు దైవ సందేశం అందించారు.

గురజాలలో..

గురజాలటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లూథరన్ చర్చి, బాప్టిస్టుచర్చిలతోపాటు మండల పరిధిలోని చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

దుర్గిలో..

దుర్గి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముటుకూరులోని ఆంధ్ర ఇవాంజికల్ క్రీస్తు లూథరన్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వాసులు భక్తిశ్రద్ధలతో క్రీస్తును ఆరాధించారు. పాస్టర్లు సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను భక్తులకు వివరించారు. చర్చి పాస్టర్ రెవ. కటికల యేసుదానం, మరియమ్మ, మాచర్ల జాన్, మోజేస్, కుక్కమూడి ప్రసాద్, మాచర్ల దేవదానం, సామేలు తదితరులు పాల్గొన్నారు.


రెంటచింతల: ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తు సిలువను మోస్తున్న భక్తులు

వైభవంగా గుడ్‌ఫ్రైడే

సత్తెనపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రైస్తవ సోదరులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్‌సీఎం, లూథరన్, బాప్టిస్ట్, తెలుగు టౌన్ బాప్టిస్ట్ చర్చి, తెలుగు బాప్టిస్ట్, బేతేల్ టౌన్ చర్చి క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆర్‌సీఎం చర్చిలో క్రీస్తును సిలువ మార్గాన్ని ప్రదర్శించారు 40 రోజులుగా క్రైస్తవులు పాటిస్తున్న ఉపవాస దీక్షలను విరమించుకున్నారు.

ఆర్‌సీఎం చర్చిలో రక్తదానం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో రెడ్‌క్రాస్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. చర్చి ఫాదర్ రాజేష్ మాట్లాడుతూ 50 మంది వరకు ఆర్‌సీఎం యువకులు రక్తదానం చేశారని చెప్పారు. రెడ్‌క్రాస్ పట్టణ అధ్యక్షుడు పుట్టి సాంబశివరావు, హోలీ ఫ్యామిలీ స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ విజయరాణి, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, శంకర నాయక్, చిన్నపరెడ్డి, సుందరరాజు పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను మత పెద్దలు బోధించారు. చర్చి ప్రార్థనల్లో ప్రార్థనల్లో భక్తులు పాల్గొన్నారు.


సత్తెనపల్లి: వివిధ వేషధారణల్లో క్రైస్తవ చిన్నారులు


సత్తెనపల్లి: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో రక్తదానం చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు


అమరావతి: లేమల్లెలో ప్రార్థనలో పాల్గొన్న ఎంఎల్ఏ ప్రవీణ్


సందేశం ఇస్తున్న పాస్టర్ సుందరరావు, పాల్గొన్న భక్తులు

క్రోసూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధ జరిగాయి. క్రోసూరు లూథరన్ చర్చిలో రెవరెండ్ ఫాస్టర్ డాక్టర్ ఎం.సుందరరావు భక్తులకు వాఖ్య సందేశం ఇచ్చారు. ఏసుక్రీస్తు సిలువలో మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారన్నారు. ఏసుక్రీస్తు సిలువ మీద పలికిన ఏడు మాటలను ఏడు గురు విశ్వాసులు ప్రపంచానికి బోధనలు చేశారన్నారు. బేతనీయ ప్రార్థన మందిరం, సెయింటాన్స్ చర్చి, హోసన్న పార్థన మందిరం, ఆర్‌సీఎం చర్చిలో వేడుకలు ఘనంగా జరిగాయి.

లేమల్లెలో ఎమ్మెల్యే ప్రవీణ్, ఎంపీ లావు ప్రార్థనలు

అమరావతి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం లేమల్లె గ్రామంలో జరిగిన ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగాపాల్గొన్నారు. గుడ్‌ఫ్రైడే ప్రతి కుటుంబంలో సంతోషాన్ని కలుగజేయాలని ఆకాంక్షించారు. పలు ఆర్‌సీఎం చర్చి పరిధిలో సిలువ మార్గం నిర్వహించారు.

● అచ్చంపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తాడువాయిలోని తిరు కుటుంబ దేవాలయంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు సిలువ మార్గాన్ని భక్తి గీతాలు ఆలపిస్తూ చర్చి వద్ద నుంచి రక్షణ గిరికి చేరుకున్నారు. తాళ్ల చెరువు విచారణ గురువు రెవరెండ్ పుట్టి అంతోని రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సహాయక గురువు రెవరెండ్ ఫాదర్ శ్యామ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.

● బెల్లంకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్‌ఫ్రైడే వేడుకలను చర్చిల్లో వైభవంగా నిర్వహించారు. చంద్రాజుపాలెం ఆంధ్రా ఏఈఎల్‌సీ చర్చిలో పాస్టర్ కేవీ రావు ప్రార్థనలు నిర్వహించారు.

● పెదకూరపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సిలువ వేయబడిన ఏసుక్రీస్తు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించు కోవాలని ఆంధ్రా యువాంజికల్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ మత్తె నరేష్ కుమార్ పేర్కొన్నారు. పెదకూరపాడులోని లూథరన్ క్రైస్తవ దేవాలయంలో గుడ్‌ఫ్రైడే పండుగను పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. పలువురు ఈ సందర్భంగా ప్రేమ విందు ఏర్పాటు చేశారు.


బహుమతులను అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

విజేత జట్టుకు బహుమతి ప్రదానం

మాచర్లటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేబీఆర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత జట్టుకు శుక్రవారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి నగదు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా ఈ టోర్నమెట్ నిర్వహించారు. విన్నర్ శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి క్రికెట్ టీంకు రూ.50,116, రన్నరప్‌గా నిలిచిన బీఎస్ఆర్ యూత్‌కు రూ.30,116, మూడో స్థానంలో నిలిచిన డార్క్ నైట్స్‌కు రూ.20,116 నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కృష్ణకు రూ. 3,016, బెస్ట్ బ్యాట్స్‌మెన్ అశోక్‌కు రూ.2,016, బెస్ట్ బౌలర్ సైదారావుకు రూ.2,016లను అందించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన జూలకంటి గౌతమ్‌రెడ్డి, అక్కిరెడ్డి, దుర్గెంపూడి శశిభూషణ్‌రెడ్డి, బోయ వెంకట్రామిరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న మంగమ్మ

క్రోసూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానాన్ని పెంచుకొని, భర్త ఆమె గొంతును బ్లేడుతో కోసిన ఘటన క్రోసూరులో శుక్రవారం జరిగింది. తీవ్రంగా గాయపడిన భార్య మంగమ్మను బంధువులు సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల వివరాల మేరకు.. క్రోసూరు చెంచు కాలనీ కి చెందిన మంగమ్మ గ్రామాల్లో సోది చెప్పుకొని, భర్త శ్రీనివాసరావు దిష్టి బొమ్మలు, ముష్టికాయలు అమ్ముకొని జీవిస్తుంటారు. ఈ క్రమంలో భార్య మంగమ్మ ఇటీవల వివాహేతర సంబంధం పెట్టుకుందని శ్రీనివాసరావు అనుమానాన్ని పెంచుకున్నాడు. తరచుగా ఆమెతో గొడవపడుతూ కొడుతూ ఉండేవాడు. ఉదయం ఇంటిలో పనులు చేసుకుంటున్న మంగమ్మ గొంతును శ్రీనివాసరావు బ్లేడుతో కోశాడు. తీవ్రంగా గాయపడిన మంగమ్మను సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ దాసు తెలిపారు.

విషం కలిపిన కుడితి తాగి గేదెలు మృతి

బెల్లంకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విషం కలిపిన కుడితినీరు తాగి మూడు పాడిగేదెలు మృతిచెందిన ఘటన కందిపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. పశువుల యజమాని వెంకటరావు వివరాల మేరకు.. సాయంత్రం గేదెలను ఇంటికి తోలకు వచ్చి గాబులో ఉన్న కుడితి నీటిని తాగించినట్లు తెలిపారు. రాత్రి పాలు పితికేందుకు వెళ్లగా అప్పటికే మూడు పాడి గేదెలు మృతి చెందినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు కుడితి నీటిలో విషం కలిపారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు, మండల పశు వైద్యాధికారి గేదెలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు బాధిత రైతు తెలిపారు. వాటి విలువ రూ 2.50 లక్షలు ఉంటుందని, అప్పు తెచ్చి పాడి గేదెలను కొనుగోలు చేశానని వాపోయారు.

లీకేజీతో తాగు నీరు వృథా

నకరికల్లు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో అన్ని ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా అందక పోతుండగా.. నకరికల్లులో మాత్రం కొట్ల బజారులో పైపులైన్ లీకేజీ కారణంగా తాగు నీరు వృథాగా పోతోంది. రెండు రోజులుగా తాగు నీరు వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా లీకేజీలను అరికట్టి అన్ని ప్రాంతాలకు తాగు నీరు అందించాలని నకరికల్లు వాసులు కోరుతున్నారు.


కొట్ల బజారులో పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

అగ్నిప్రమాదాలపై అవగాహన

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరావు పెట్రోలు బంక్, సూర్య డెకో ప్రొడక్షన్ ఇండస్ట్రీ, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బి. పేరారెడ్డి, వి.రామవరప్రసాద్, కె.చంద్రశేఖర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బంది అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో పని చేసే సిబ్బందికి అగ్ని ప్రమాదాల పై అవగాహన కల్పించారు. మస్తాన్‌వలి, గౌస్, విజయ భాస్కర్‌రెడ్డి, మహీందర్ రెడ్డి, గోవిందు, నాగేశ్వరరావు, సుభానీ పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం అగ్నిమాపక కేంద్రం అధికారులు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఫరీద్ గ్యాస్ కంపెనీ గోడౌన్‌లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి ఫైర్ ఆఫీసర్ సునీల్ వివరించారు.


సత్తెనపల్లి: పెట్రోల్ బంకులో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బారావు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఘనంగా దాసు నాయన మఠం ఆరాధనోత్సవాలు

నాదెండ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం సినిమా హాల్ సెంటర్‌లోని దాసు నాయనస్వామి మఠం 86వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రవచనాలు చేశారు. విశ్వ హిందూ పరిషత్ పోకల వెంకటరావు ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వేటపాలెం శివకేశవ గురూజీ, సాధు పరిషత్ సభ్యులు దయానంద్ తదితరులు హిందూ మత ధర్మ పరిరక్షణపై మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్థులకు అన్నదానం చేశారు.

తహసీల్దార్‌గా అర్జున్‌నాయక్ బాధ్యతల స్వీకరణ



శావల్యాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా అర్జున్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రెంటచింతల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై శావల్యాపురానికి వచ్చారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కర్రి సుజాతపై అవినీతి ఆరోపణలు రావడంతో ఇటీవల జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఆర్డీవో మధులత విచారణ చేపట్టి తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దానిపై తహసీల్దార్ సుజాత సరైన వివరణ ఇవ్వకపోవడంతో జిల్లా కలెక్టర్ ఆమెను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు కార్యాలయానికి వచ్చిన అర్జున్ నాయక్‌కు రెవెన్యూ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంతగుడిపాడు సమీపంలో మృతిచెందిన వ్యక్తి

రొంపిచర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడు సమీపంలో అద్దంకి - నార్కెట్‌పల్లి హైవే సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు కనుగొన్నారు. దీంతో రొంపిచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తుల ఆహ్వానం

శావల్యాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలననుసరించి శావల్యాపురంలోని శ్రీరామపబ్లిక్ స్కూల్లో 1వ తరగతిలో ప్రవేశానికి 25శాతం విద్యార్థులను ఉచితంగా పాఠశాలలో చేర్చుకునేందుకు దరకాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌టీఐ చట్టం 2009 ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటో తరగతి ప్రవేశానికి 25శాతం సీట్లు ఎటువంటి ఫీజులు లేకుండా చేర్చుకోవాల్సి ఉందన్నారు. కాబట్టి తమ పాఠశాలలో 25శాతం మందికి ఉచితంగా సీట్లు కేటాయించామని, ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి'

వినుకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమైక్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు తిరుపతి నగరంలో మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏరియా కార్యదర్శి దారివేముల మరియబాబు తెలిపారు. ఈ మేరకు స్థానిక సీపీఐ ఆఫీస్‌లో జాతీయ మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిందని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. తిరుపతిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, ప్రసాద్, సుభాని, ఎస్‌కే వలి, మస్తాన్, చంటి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొప్పుకొండ తిరునాళ్ల

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేశునిపాలెం సమీపంలోని ఆంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకొని కొప్పుకొండ పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు రెండు భారీ విద్యుత్ ప్రభలను, ఒక జనసేన నాయకులు ఒక ప్రభ నిర్మించనున్నట్లు తెలిపారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా పట్టణ సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు బ్రహ్మదాసు ఆరాధన ఉత్సవాలు

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి విజ్ఞాన మందిరంలో పీఠాధిపతి బ్రహ్మదాసు ఆరాధన ఉత్సవాలను శని, ఆదివారాలు రెండ్రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి దేసు మల్లికార్జునరావులు శుక్రవారం తెలిపారు. ఆదివారం బ్రహ్మదాసు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు అచలానంద ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణ సిద్ధానంద స్వామి పాల్గొంటారని తెలిపారు. భక్తులు ఆరాధన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



శిలువను మోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా తెలుగు బాప్టిస్ట్ సంఘం టౌన్ చర్చి ఆధ్వర్యంలో శిలువధారి యాత్ర జరిగింది. పట్టణంలో స్థానిక క్రిస్టియన్‌పాలెం నుంచి టౌన్ చర్చి వరకు శిలువ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఈ సందర్భంగా శిలువను మోశారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గుత్తా అంకమ్మ చౌదరి, తదితరులు ఉన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని వివిధ చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు, సర్వ మానవ పాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును 'శుభ శుక్రవారం'గా పేర్కొంటూ క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తండ్రిసన్నిధి చర్చి పాస్టర్ బ్రదర్ షాలెంరాజు చెప్పారు. గుండయ్యతోటలోని క్రిస్టియన్ అసెంబ్లీ నిరీక్షణ ప్రార్థనా మందిరం, భావనా రుషినగర్‌లోని తండ్రి సన్నిధి, పురుషోత్తమపట్నం మార్గంలోని ఏసుక్రీస్తు దివ్యశాంతి నిలయం, తూర్పుమాలపల్లిలోని పరిశుద్ధ మత్తయ్య చర్చి, సంజీవనగర్ చర్చి, చార్లెస్‌హైస్కూల్ వద్ద ఉన్న ఆర్సీఎం చర్చి, సాంబశివనగర్‌లోని సీయోను ప్రార్థనమందిరంలలో ప్రార్థనలు జరిగాయి. ఆర్సీఎం చర్చిల ఆధ్వర్యంలో శిలువ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభువు శిలువ మోసిన నేపథ్యం, ఏసు బోధనలు, సందేశాలు, వాక్యాలను పాస్టర్లు వివరించారు. పెద్ద సంఖ్యలో విశ్వాసులు చర్చలకు హాజరై ప్రార్థనలు చేశారు.

● వినుకొండ: పట్టణంలో పలు ప్రార్థనా మందిరాల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్, రోమన్ క్యాథలిక్, హెబ్రోను తదితర సంఘాలకు చెందిన చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి శాంతి సమాధానాలతో జీవించాలని, క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పలువురు పాస్టర్లు వివవరించారు. శిలువపై క్రీస్తు మాట్లాడిన ఏడు మాటలను ఆయా సంఘాలకు చెందిన వక్తలు వివరించారు.





తండ్రి సన్నిధి చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు, కార్యక్రమంలో మాట్లాడుతున్న పాస్టర్ షాలేము రాజు

చర్చి, రిఫార్మర్డ్ చర్చి, ఎఫ్రాయిమ్ ప్రార్థనా మందిరం, జీవాలయం, హోసన్న, జయధ్వని తదితర చర్చిల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి ప్రపంచ మానవాళి కోసం తన ప్రాణాన్ని అర్పించిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటామని తెలియజేశారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక కీర్తనలు, దైవ సందేశాలతో వేడుకలు నిర్వహించారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల, తూబాడు, చందవరం, గొరిజవోలు, జంగాలపల్లి, చందవరం, సాతులూరు, అమీన్ సాహెబ్ పాలెం, ఇర్లపాడు తదితర గ్రామాల్లోని ఏఈఎల్‌సీ

● రొంపిచర్ల: మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్లు సందేశాలను ఇచ్చారు.

● బొల్లాపల్లి: మండలంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్లు ఏసుప్రభు ప్రబోధించిన ఏడు వాక్యాల గురించి వివరించారు. అందరూ ఏసు మార్గంలో నడాలని, త్యాగ, క్షమ గుణాలను కలిగి ఉండాలని సూచించారు. మండలంలోని రెడ్డిపాలెం, బొల్లాపల్లి, పేరూరుపాడు, సరికొండపాలెం, వెల్లటూరు తదితర గ్రామాల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గుడ్‌ఫ్రైడే పర్వదినం సందర్భంగా చర్చిలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.

బాలికా విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



ఏపీ మోడల్ స్కూల్ బాలికా వసతి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

ఈపూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బాలికా విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని వనికుంట సమీపంలో ఏపీ మోడల్ స్కూల్ బాలికలకు రూ2.26 కోట్ల నిధులతో వసతి గృహం నిర్మాణం చేసేందుకు శుక్రవారం చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ బాలికలకు విద్యతోపాటు సురక్షతమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. గత ప్రభుత్వం విద్య, వైద్యంను నిర్లక్షం చేసిందన్నారు. వైసీపీ నాయకులు దోపిడీదారులుగా మారి అభివృద్ధిని నిర్లక్షం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినప్పటికీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ అభివృద్ధి పనులను చేపట్టకుండా నీరుగార్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, సర్పంచ్ బచ్చన బోయిన సుబ్బయ్య, అయినాల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లా వెంకటకోటయ్య, గోలి అప్పారావు, డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్, జాగర్లమూడి నాగేశ్వరరావు, నర్రా కిశోర్, నందిగం అక్కారావు, అబ్బూరి ఏడుకొండలు, కాసరగడ్డ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం: జీవీ

ఈపూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం దోపిడీ తప్ప ఎక్కడా కూడా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలో శుక్రవారం జరిగిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అంగలూరు మేజర్, కొండాయిపాలెం మైనర్ కాలువల అభివృద్ధి పనులను ప్రారంభించారు. వనికుంటలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దోపిడీ చేసి అభివృద్ధిని మరిచారన్నారు. కాలువల మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరు అందక రైతులు నానా అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలువల అభివృద్ధికి నిధులు మంజూరుచేసి పనులు కూడా చేస్తున్నారన్నారు. దాంతో చివర భూములకు సాగునీరు చేరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, సర్పంచ్ బీ సుబ్బయ్య, వెంకట కోటయ్య, నర్రా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోండి

వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు హితవు పలికారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలగలేదని అన్నారు. కొచ్చెర్లలో జనసేన కార్యకర్తలను ఇంటికి వెళ్లి వైసీపీ నాయకులు గొడ్డలితో గాయపరిచిన సంఘటన బొల్లా బ్రహ్మనాయుడికి కన్పించడంలేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన హాహిళ హత్యపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందన్నారు. తప్పుచేస్తే ఎవరినీ వదిలేది లేదన్నారు.

రేపు జరిగే శాంతి ర్యాలీని జయప్రదం చేయండి

● పలు ముస్లిం సంఘాల పిలుపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివారం చిలకలూరిపేటలో చేపట్టనున్న శాంతి ర్యాలీలో లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ, పలు ముస్లిం సంఘాల నాయకులు శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కళామందిర్ సెంటర్‌లోని మర్కస్ మసీదు వద్ద నుంచి ఉదయం 9గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. వక్ఫ్ చట్టం రాజ్యాంగంలోని, ఆర్టికల్ 24, 25, 26లో కల్పించిన హక్కులకు భంగకరంగా ఉందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంజుమన్ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు షేక్ జాన్ పీర్, జమాతే ఉలేమా హింద్ అధ్యక్షుడు మౌలానా అనస్, సనా సేవా సంస్థ అధ్యక్షుడు యూసఫ్, రాజ్యాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ రఫూఫ్, ముస్లిం జేఏసీ సభ్యులు కరీముల్లా, నాసర్ వలి, షేక్ అబ్దుల్ జబ్బర్, అహ్మద్, రఫీ పాల్గొన్నారు.

వర్గ వైషమ్యాలు సృష్టిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా

● ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి శ్రీనివాసరావు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వర్గభేదాలు సృష్టించి రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటివి తగదని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు హితవు పలికారు. కారంపూడి రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీదరించుకున్నప్పటికీ వైసీపీ నాయకుల్లో నేటికీ మార్పు లేదన్నారు. ఇటీవల ఈపూరు మండలం కొచ్చర్లలో వైసీపీ, జనసేన పార్టీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో మాజీ ఎమ్మెల్యే బొల్లా వ్యవహరించిన తీరు సరికాదన్నారు. గ్రామంలో సామాజిక వర్గాల మధ్య చిచ్చుపెట్టడం తగదన్నారు. పోలీసులు గ్రామంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జనసేన పార్టీ కార్యకర్తలకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ నాయకులు నిశ్శంకర అంకారావు, గార్లపాటి చిననర్సయ్య, నరసింహారావు, వీరమహిళ ఉషారాణి పాల్గొన్నారు.

రెండు వార్డులలో టీడీపీ సంస్థాగత ఎన్నికల సమావేశం

చిలకలూరిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7,19 వార్డులలో టీడీపీ సంస్థాగత ఎన్నికల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో పరిశీలకులుగా పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి క్రమం తప్పకుండా పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈసారి జరిగే సంస్థాగత ఎన్నికల్లో మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పార్టీ ఆదేశాల ప్రకారం ప్రతి 60మంది ఓటర్లకు ఇద్దరు కుటుంబ సాధికార సారథులను నియమించాల్సి ఉంటుందన్నారు. వీరిలో ఒకరు పురుషుడు, మరొకరు మహిళ ఉండాలన్నారు. మే 15నాటికి నియోజకవర్గ పరిధిలో ఉన్న కమిటీలను పూర్తిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, మురకొండ మల్లిబాబు, అజారుద్దీన్, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడక మేజరు మరమ్మతులు ప్రారంభం

నూజెండ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక మేజరు కాలువ మరమ్మతు పనులను శుక్రవారం ములకలూరు డీసీ30 చైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి ప్రారంభించారు. కాలువ కట్టలపై, కాలువల్లో కంపచెట్లు మొలచి రైతులు ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రూ.25లక్షలు నిధులు మంజూరయ్యాయని, మేజరు పరిధిలోని మైనర్లకు కూడా మరమ్మతులు చేయనున్నట్లు బుల్లీశ్వరరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ జేఈ ప్రసన్నకుమార్, రైతులు సంగు సుబ్బారెడ్డి, పేరం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వినుకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా 5వ రోజు వినుకొండ అగ్నిమాపక కేంద్ర అధికారి, సిబ్బంది పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై వివరించారు. సాధారణంగా పెట్రోల్ బంకుల్లో సంభవించే అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక పరికరాలను ఉపయోగించే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర అధికారి బి.నాగేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాసరావు, రమణారెడ్డి, రవికుమార్, కేశవబాబు, ప్రభాకర్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, మల్లికార్జునరావు, బాషాఖాన్, మస్తాన్‌వలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారు

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతిలో జరుగుతున్న ఘటనలు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నరసరావుపేటలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన తిరుమలలో ఎనిమిది నెలలో సగటున పది, పదిహేను గోవులు చనిపోతున్నాయన్నారు. వైసీపీ నాయకుడు భూమన కరుణాకర్‌రెడ్డి హిందువులు పరమ పవిత్రంగా భావించే గోవులకు రక్షణ లేదని, దాదాపు 160గోవులు చనిపోయాయని వెల్లడించారన్నారు. ప్రభుత్వం ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సింది పోయి ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులను గోశాలకు రాకుండా అడ్డుకోవటం అన్యాయమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కూడా ప్రశ్నిస్తున్నామని, సనాతన ధర్మం అంటే కాషాయ వస్త్రాలు ధరించి మైకులలో ఘోషించడం కాదన్నారు. గోవుల మృతిపై కమిటీవేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రభుత్వ సమయం అంతా వైసీపీ నాయకుల మీద కేసులు పెట్టామా, అరెస్ట్ చేశామా, జగన్‌మోహన్‌రెడ్డిని భూతులు తిట్టామా అనే విషయాలపైనే తొమ్మిది నెలలు అయిపోయిందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటు, మహిళలకు ఉచిత బస్సు, సూపర్ సిక్స్ వంటి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఏసు ప్రభువు త్యాగాన్ని స్మరించుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే నాడు ఏసుప్రభువు మానవాళికోసం చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ, ఆయన చూపిన సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం చెప్పారు. ఏసు క్రీస్తు ఆశీస్సులతో శాంతి, క్షమ, మానవతా విలువలతో నిత్యం దయాగుణంతో జీవిస్తూ, పరులకు సాయపడటమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన కానుక అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని 8,400ల మందికి పైగా పాస్టర్లకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. 2024 మే నుంచి నవంబరు వరకు 7 నెలల గౌరవవేతనాన్ని కూటమి ప్రభుత్వం ఒకేసారి మంజూరు చేసిందన్నారు. దీనివల్ల ఒక్కో పాస్టర్‌కు రూ.35 వేలవరకు లబ్ధి చేకూరుతుందని, అర్హులైన ప్రతి పాస్టర్‌కు ఆ మొత్తం అందుతుందన్నారు. రాష్ట్ర పురోగతి, ప్రజల శ్రేయస్సుకు కట్టుబడి కూటమి ప్రభుత్వం అన్ని మతాలు, వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుంటే, ఓర్వలేని వైసీపీ మత రాజకీయాలతో విద్వేషం సృష్టించేందుకు కుటిలచర్యలకు పాల్పడుతోందని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల

గంటవారిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేల్పూరు పంచాయతీ పరిధిలోని గంటవారిపాలెంలో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కనున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద తిరునాళ్ల వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి పాలాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగలి వండి స్వామివారికి నైవేద్యాన్ని సమర్పించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్థులు తిరునాళ్ళకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్థులు రెండు విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ళలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎస్ఐ లోకేశ్వరరావు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



ప్రభుత్వ గురుకుల, మోడల్ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ ఆశయాలను అనుగుణంగా నియోజక వర్గంలోని ప్రభుత్వ గురుకులు పాఠశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ పాఠశాల్లో విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపరచి, విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశించారు. కొత్తపేటలోని జీవీ క్యాంప్ కార్యాలయంలో పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రాథమిక విద్య నుంచి విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో వినుకొండ చీకటీగలపాలెం మోడల్ పాఠశాలకు చెందిన పమ్మి కీర్తనకు 1000 మార్కులకు గాను 970 మార్కులు సాధించిన సందర్భంగా జీవీ ప్రత్యేకంగా అభినందించారు.